# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే పలు కీలక ఆహార శుద్ధి పరిశ్రమలను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు.**

**2. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఢిల్లీలో జరుగుతోంది.**

**3. ప్రధానమంత్రి స్వనిధి పథకం కింద ఇప్పటి వరకు 50 లక్షల మంది వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందింది.**

**4. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు.**

**5. ఆసియా క్రీడల ఆర్చరీ విభాగంలో విజయవాడకు చెందిన వెన్నం జ్యోతి సురేఖ జట్టు స్వర్ణ పతకం సాధించింది.**

============================

రాష్ట్ర పారిశ్రామిక రంగాభివృద్ధిలో భాగంగా పలు ఆహారశుద్ధి పరిశ్రమలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు ప్రారంభించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా మొత్తం 13 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వీటి ద్వారా దాదాపు 2 వేల 851 కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయి. అలాగే... 6 వేల 705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కలగనుంది. 7 ప్రాజెక్టులకు భూమిపూజతో పాటు మరో 6 ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

-----------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం ఈరోజు ఢిల్లీలో జరుగుతోంది. పలు ముఖ్యమైన అంశాలపై మంత్రివర్గ సమావేశం చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణా రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న పసుపుబోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలియజేయనున్నట్టు సమాచారం.

-----------------------------

ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి, ప్రధాన మంత్రి స్వనిధి పథకం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 50 లక్షల మంది వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించి నూతన మైలు రాయిని అధిగమించింది. దేశ వ్యాప్తంగా పట్టణ వాసులకు నిత్యావసర వస్తువులను అందజేస్తూ పట్టణ అసంఘటిత రంగంలో వీధి వ్యాపారులు కీలక భూమిక పోషిస్తున్నారు. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ పథకం ప్రవేశపెట్టి...

వీధి వ్యాపారులను సంఘటిత ఆర్థిక రంగంలోకి తీసుకురావడానికి కృషి చేస్తోంది. వీధి వ్యాపారులకు ఈ పథకాన్ని మరింత చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో గత జూలై ఒకటవ తేదీ నుండి ఈ పథకం కింద సాధించవలసిన లక్ష్యాలను సవరిస్తూ కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రచారాన్ని ప్రారంభించింది.

---------------------------

సనాతన ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా వుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన ధర్మ ప్రచార వారోత్సవాలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైందవ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మపరిరక్షణకు పాటుపడాలని తద్వారా సమసమాజ స్థాపన సాధ్యపడుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పెద్దఎత్తున ధర్మ ప్రచార వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రేపు ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో రేపు ఆయన పాల్గొనవలసి వున్న సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం వాయిదా వేసినట్టు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన రైళ్ల కొత్త టైంటేబుల్‌ను రైల్వే మంత్రిత్వ శాఖ నిన్న విడుదల చేసింది. 64 కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు, మరో 70 ఇతర రైళ్ల సేవలను ఇందులో చేర్చారు. వివిధ నగరాల మధ్య అనుసంధానాన్ని పెంచి, ప్రయాణ సమయాన్ని తగ్గించేలా సమయ పట్టికను రూపొందించినట్లు రైల్వేశాఖ తెలిపింది. 90 రైళ్ల గమ్యస్థానాలను మార్చడం, 12 రైళ్లు నడిచే రోజులను పెంచడం, 22 రైళ్లను సూపర్‌ఫాస్ట్‌లుగా నడపనుండడం వల్ల రాకపోకల సమయాలను ప్రయాణికులు ముందుగా సరిచూసుకోవాలని సూచించింది. రైల్వే అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ఈ వివరాలు లభ్యమవుతాయని తెలిపింది.

---------------------------

చైనా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు. తాజాగా విజయవాడ నగరానికి చెందిన విలువిద్య క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఆర్చరీ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఓజాస్ దియోలేతో కలిసి ఆమె స్వర్ణ పతకం సాధించారు. తుది పోటీలో సురేఖ-ఓజాస్ 159-158 స్కోరుతో చైవాన్-జూజ హివూన్ పై ఉత్కంఠ విజయం సాధించారు. ప్రస్తుతం... ఆసియా క్రీడల్లో భారతదేశం సాధించిన పతకాల సంఖ్య 71కి చేరుకుంది. ఈ క్రీడలలో అత్యధిక పతకాల రికార్డును భారతదేశం అధిగమించింది. 2018 సంవత్సరంలో జరిగిన పోటీలలో భారత్ 70 పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్ ఖాతాలో 16 స్వర్ణ పతకాలు, 26 రజత పతకాలు, 29 కాంస్య పతకాలు వున్నాయి.

---------------------------

విద్యార్థులలో అంతరిక్ష పరిశోధనపై అవగాహన కలిగించేందుకు అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర డైరెక్టర్ డాక్టర్ రాజరాజన్ తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఈరోజు అంతరిక్ష వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ... వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తమిళనాడు ఒడిస్సా రాష్ట్రాలలోని 9 ప్రాంతాల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేసామన్నారు. ప్రదర్శనలో భాగంగా అంతరిక్ష పరిశోధనలపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దీంతోపాటు విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేస్తామని రాజరాజన్ వెల్లడించారు.

---------------------------

పోస్టాఫీస్‌లో ఆకర్షణీయమైన బీమా పథకాలు, సురక్షితమైన పొదుపు పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని తిరుపతిలో ప్రారంభించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీస్‌ల ద్వారా అందించే వివిధ రకాల పథకాలను తెలియజేస్తూ ముద్రించిన పోస్టర్లను తిరుపతి పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ ఎం.డి.సాదిక్ ఆటోలకు స్వయంగా అంటించారు. తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారికి తపాలా బీమా, సుకన్య సమృద్ధి అకౌంట్, మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, రికరింగ్ డిపాజిట్, టైం డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ అకౌంట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు.

---------------------------

రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ వారం రోజుల పాటు ఆందోళనలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. విజయవాడ నగరంలో నిన్న సమావేశమైన సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎం.ఎల్ పార్టీల నాయకులు ఇందుకు సంబంధించి ఈనెల 9 నుండి 15వ తేదీ వరకు ఆందోళన నిర్వహించాలని నిర్ణయించారు. ఆందోళనలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలని...దీంతో పాటు... వీధులు, కాలనీలలో సమావేశాలు నిర్వహించి... ప్రజా బ్యాలెట్ నిర్వహించాలని కూడా నిర్ణయించాయి. రాష్ట్రంలో వర్షాభావం వల్ల కరవు పరిస్థితులు నెలకొన్నాయని... ప్రభుత్వం తక్షణమే కరవు నివారణా చర్యలు చేపట్టాలని కూడా ఆయా పార్టీల తరఫున పాల్గొన్న రాష్ట్ర స్థాయి నాయకులు కోరారు.

---------------------------

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎస్.ఎస్.డి టోకెన్లను రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. పెరటాసి శనివారాల నేపథ్యంలో తిరుమలలో కొనసాగుతున్న అధిక రద్దీ దృష్ట్యా ఎస్.ఎస్.డి టోకెన్ల జారీని రద్దు చేసింది. అక్టోబర్ 6, 7, 8, 13, 14, 15వ తేదీల్లో ఎస్.ఎస్.డి టోకెన్లను నిలిపివేయనున్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.

=====================